క్లుప్తంగా

60 శాతం ఇంటి పన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇంటి పన్ను వసూలు ముమ్మరంగా జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు ఇప్పటి వరకు 60 శాతం పన్ను వసూలు చేశారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.75 లక్షల 69 వేల 534 లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.45 లక్షల 46 వేల 976 వసూలు అయినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా తెలిపారు. మిగతా 40 శాతం మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించినట్లు ఎంపీడీఓ చెప్పారు.

మూడోరోజు సర్వర్ డౌన్

శివ్వంపేట(నర్సాపూర్): ధరణి సర్వస్ డౌన్‌తో మూడో రోజు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధరణి పోర్టర్ సర్వర్ సక్రమంగా రాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన అమ్మకం, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూర్తిస్థాయిలో బుధవారం రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో కొనుగోలుదారులు వారితో పాటు వచ్చిన అమ్మకందారులు వెనుతిరిగి వెళ్లారు. సంబంధిత అధికారులు స్పందించి ధరణి సర్వర్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ధరణి తిప్పలు యథాతథం

నర్సాపూర్: ధరణి సర్వర్ మూడో రోజు బుధవారం సైతం సరిగా పని చేయకపోవడంతో రైతులు ఇబ్బందుల పాలయ్యారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ధరణి సర్వర్ సరిగా పని చేయకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పడిగాపులు పడుతున్నారు. బుధవారం సైతం ఐదు రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈవిషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సరిగా పని చేయడం లేదని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

సన్మానం



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న రామాయంపేట నాయకులు

రామాయంపేట(మెదక్): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశ్‌గౌడ్‌ను బుధవారం పార్టీ నాయకులు సన్మానించారు. మండలానికి చెందిన బీజేపీ నాయకులు నర్సాపూర్‌లో ఆయన్ను సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌గౌడ్, సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, ఎల్లంగౌడ్, కార్తీక్, సతీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పెద్దశంకరంపేట(మెదక్): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్‌నేరాలపై ఎస్‌ఐ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనవసర కాల్స్‌కు తమ సమాచారాన్ని ఎవరికీ తెలపొద్దని, ఓటీపీల పేరుతో, లాటరీలు, బంపర్ ప్రైజ్‌లు వచ్చాయని కాల్స్ చేసి మోసం చేస్తున్నారని ప్రజలు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సునీత ఉన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత



కొంతన్‌పల్లిలో నరికివేసిన చెట్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు రాంచంద్రంగుప్తా, శేఖర్, సత్తయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లిలోని పట్టా భూమి సర్వే నంబర్ 433లో మంగళవారం రాత్రి 20 భారీ వృక్షాలను నెలకూల్చినట్లు బాధిత రైతులు వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేయించిన నిరంజన్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో కౌలు రైతు సత్తయ్య బుధవారం ఫిర్యాదు చేశాడు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా..

- ముదిరాజ్‌ల చైతన్యం చూస్తే భయం
- ముదిరాజ్ సంకల్ప సభలో కాంగ్రెస్ నాయకుడు నీలంమధు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నీలంమధు

నర్సాపూర్: ముదిరాజ్‌ల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, రాష్ట్రంలోని వచ్చిన ఈ చైతన్యాన్ని చూసి పలు రాజకీయ పార్టీలు భయపడుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు నీలంమధు ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రతీ గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు తమ చైతన్యాన్ని రుజువు చేశారని చెప్పారు. తమ కులాన్ని బీసీ- డీ నుంచి బీసీ- ఏ లోకి మార్చాలన్న డిమాండ్‌ను సాధించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ముదిరాజ్ సంక్షేమ సమితి ప్రతినిధులు తనతో వస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ- ఏ లోకి మారుస్తూ జీఓ ఇచ్చారని, ఆ తర్వాత అధికారంలో ఉన్న ఏ పార్టీ ఇప్పటి వరకు ఆజీఓను అమలు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌ల కోసం ప్రాణం పోయినా లెక్క చేయనని, జీఓ అమలుతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కొనం పోరాటం చేస్తానన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండాలన్నారు. తమలో తమను చీల్చడానికి పలు పార్టీల నాయకులు కుట్రలు చేస్తుంటారని వాటిని తిప్పి కొట్టాలని ఆయన హితవు పలికారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చిత్రపటానికి నీలంమధు క్షీరాభిషేకం చేశారు. సంకల్ప సభలో ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్, కన్వీనర్ నారాయణ, నాయకులు నర్సింహ, రమేశ్, మల్లేశ్, శేఖర్, అశోక్, సుజాత, సంతోష్, నాగబూషణ్, సునీత, ఆంజనేయులు, కొందికుమార్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

మెదక్ ఎమ్మెల్యే రోహిత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిన్‌పూర్ చర్చి వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మెదక్‌లోని చర్చి అభివృద్ధికి, కనీస సౌకర్యాల కోసం రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. మిన్‌పూర్ చర్చికి అభివృద్ధికి కూడా కృషి చేస్తామన్నారు. ఏడుపాయల ఆలయానికి డబుల్ రోడ్డు కోసం రూ.35 లక్షలు మంజూరు చేశామన్నారు. మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ర్యాబెన్‌మార్క్, ప్రిసిల్లా పరిమల రూబెన్, విన్‌స్టన్, జయానంద్, సాలమన్ రాజ్, విమల్ కుమార్, ప్రభు కిరణ్, విల్సన్, జార్జ్ ఎబెనెజర్ రాజు, అనిల్ కుమార్, డాక్టర్ దయానంద్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, క్రీస్తుదాస్, రత్నయ్య, బాబర్ పటేల్, నాగరాజు, విజయ్‌కుమార్, దావీద్, ఆంద్రయ్య, ప్రశాంత్, ఆకుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రెడ్డి సంఘం ప్రతినిధులు



రామాయంపేట(మెదక్): ఎస్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు



నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో..

రామాయంపేట(మెదక్): రెడ్డి సంఘంపై విమర్శలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి కులాల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్న మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నర్సాపూర్: తమ కులస్తులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)పై చర్యలు తీసుకోవాలని సీఐ జాన్‌రెడ్డికి రెడ్డి సంఘం ప్రతినిధులు బుధవారం ఫిర్యాదు చేశారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని సీఐ జాన్‌రెడ్డికి ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్లు వారు చెప్పారు. వారి వెంట పలువురు సంఘం ప్రతినిధులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీపసుకోవాలని మండల రెడ్డి సంఘం సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం రెడ్డి సంఘం సభ్యులు తీన్మార్ మల్లన్న చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మీనారెడ్డి, నర్సింహరెడ్డి, ప్రదీప్ రెడ్డి, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

కొ(ర్రతండాలో నీటి సమస్య

- పట్టించుకోని అధికారులు
- నీటి కోసం పొలంవద్దకు వెళ్తే గొడవ చేస్తున్న రైతులు



వరిపొలంవద్ద నీళ్ల కోసం నిలబడ్డ తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): నీటి సమస్యతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శేరితండా పంచాయతీ కొర్రతండాలో తీవ్ర నీటి సమస్య నెలకొంది. తండాలో సుమారు 35 కుటుంబాలు ఉన్నాయి. మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నప్పటికీ నీళ్లు రావడంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటి సమస్య కారణంగా తండావాసులు పంట పొలాల నుంచి మూడు నెలలుగా నీళ్లు తెచ్చుకుంటున్నారు. కాగా ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గుతుండటంతో వరిపంటకు నీళ్లు సరిపోవడంలేదు. దీంతో రైతులు బోరుబావుల వద్దకు మంచినీటి కోసం తండావాసులు వస్తే... రానీయడంలేదు. వెలితే గొడవ పడుతున్నారని చెప్పారు. మూడు నెలలుగా సమస్య ఉండగా పంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి చెప్పినా.. పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి ఇర్షద్‌ను వివరణ కోరగా.. తండాలో నీటి సమస్య ఉందని, భగీరథ నీళ్లు సరిపోవడంలేదన్నారు. సమస్య త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

విద్యారంగానికి మొండిచెయ్యి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సాపూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చెయ్యి చూపించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుమార్ ఆరోపించారు. బుధవారం నర్సాపూర్ చౌరస్తాలో నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ పోషకాహార నిధులు తగ్గించిందన్నారు. విద్యరంగానికి న్యాయం చేయకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నర్సాపూర్ మండలాధ్యక్షుడు అర్జున్, నవదీప్ పాల్గొన్నారు.

నార్సింగిలో నిధుల దుర్వినియోగం

అవకతవకలపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రైతు సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై చర్యలు చేపట్టాలని డైరెక్టర్లు కోరుతున్నారు. నార్సింగి పీఏసీఎస్ గోదాం అద్దెకు తీసుకున్న హనుమాన్ రైస్ మిల్ యజమాన్యం నెలకు రూ.12 వేల చొప్పున రూ.1,08,000 చెల్లించినప్పటికీ సీఈఓ పీఏసీఎస్ ఖాతాలో జమచేయలేదని తెలిపారు. గోదాం అద్దెతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చిన నిధులకు కూడా సరైన లెక్కలు లేవన్నారు. గోదాం అద్దె ద్వారా వచ్చిన నిధులు దుర్వినియోగం చేసిన సీఈఓతో పాటు చైర్మన్ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై డీసీఓకు ఫిర్యాదు చేసినట్లు డైరెక్టర్లు వివరించారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

రామాయంపేట(మెదక్): సేవాలాల్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల15ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సర్దార్ నాయక్, వినోద్ నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని సెలవు దినాలుగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవాలన్నారు.

ప్రతిపక్షాలు కలిసిరావాలి

శివ్వంపేట(నర్సాపూర్): హైదరాబాదు నగర చెత్తను ఇక్కడ డంప్ చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కలిసిరావాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. మండల శివారులోని గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటుతో ఇక్కడి ప్రజలు కాలుష్య ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. బుధవారం డంపుయార్డును పరిశీలించేందుకు వెళ్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఇప్పటికైన పునరాలోచించి 150 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న డంపుయార్డు నిర్మాణం విరమించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, సుధాకర్‌రెడ్డి, రాంచెంద్రంగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, అంజగౌడ్ తో పాటు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

తూప్రాన్: ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ పిలుపు మేరకు పట్టణంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణతో మాలలను అన్యాయం జరుగుతుందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. వెంటనే వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మన్నే శ్రీనివాస్, పసుల నర్సింగరావు, కొరబోయిన ప్రవీణ్ కుమార్, మన్నే రవీందర్, మొదబోయిన ఎల్లం, పర్స పోచేందర్, అఖిల్, చిట్టిమిళ్ల అనిల్ కుమార్, చిట్టిమిళ్ల సత్య నారాయణ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పార్టీల నాయకులతో బుధవారం ఎంపీడీఓ ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ఓటరు మార్పులపై ఎవ్వరికైన సందేహాలు ఉన్నాయా అని అడగగా, పలువురు పార్టీ నాయకులు పలు గ్రామాల్లో ఉన్న బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. అజ్జమర్రి, సోమక్కపేట్ గ్రామాల్లో 1200 పైగా ఓటర్లు ఉన్నప్పటికీ పోలింగ్ బూత్ ఒక్కటే ఉందనిచ అదనంగా మరో బూత్ ఏర్పాటు చేయాలన్నారు. శేరికుంట తండాను నూతన గ్రామ పంచాయతీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన



సామూహిక లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మాఘమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని వెంకటాపూర్‌లో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరై స్వామి వారికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులతో సామూహిక పుష్పార్చనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాఘ మాసం దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైనదని, ఈ సమయంలో దేవతలను కొలవడం ద్వారా శుభాలు కలుగుతాయన్నారు. ఇలాంటి సామూహిక కార్యక్రమాల ద్వారా ప్రతీ వ్యక్తిలో దైవచింతన భావం పెంపొందుతుందని తెలిపారు.

ఎనిమిది మందికే పోలింగ్ స్టేషన్



ఓటర్ల కోసం ఏర్పాటు చేసే పాఠశాల భవనం

నర్సాపూర్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 27న జరుగనున్న పోలింగ్‌కు ఎనిమిది మంది ఓటర్ల కోసం ఓ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. డివిజన్ పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 231 మంది ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 2640 మంది ఉన్నారు. కాగా కౌడిపల్లి మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఎనిమిది మంది ఉండగా, చిలప్‌చెడ్ మండలంలో 11మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వారి కోసం సైతం పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. కాగా కౌడిపల్లిలో అతి తక్కువ మంది ఓటర్లు ఉన్నారు. కాగా పోలింగ్ స్టేషన్‌లో ఉన్న ఎనిమిది మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నా.. అధికారులు పోలింగ్ సమయం ముగిసే వరకు పోలింగ్ స్టేషన్‌లోనే ఉంటారు.

సంక్షిప్త వార్తలు

◆ మధ్యాహ్న భోజనం పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి హైమవతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల చదువులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, పాఠశాల ఎస్‌ఓ శ్రీవాణి సిబ్బంది తో పాటు తదితరులు ఉన్నారు.

◆ కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గొల్లకుర్మల ఆధ్వర్యంలో బీరప్పస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నాగవెల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒగ్గు కళాకారులు బీరప్ప స్వామి, కామరాతి, అక్కమాంకాలి, బోయిడి బోగన్న వేషధారణలతో పాలు పొంగించి, చల్లలు చేసి గొర్లమందపై చల్లారు. గొర్రెపిల్లలకు కల్యాణం నిర్వహించారు. బొయిడి బోగన్న వేషధారణతో అందరిని ఆకట్టుకున్నాడు. సాయంత్రం వేళలో బంబుగొండకు బోనాల ఊరేగింపు నిర్వహించారు.

◆ బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా కొండల్‌రావు



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు కొండల్‌రావు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌తో పాటు మండలాధ్యక్షుడు రవి పలువురు నాయకులు కొండల్ రావుని బుధవారం సన్మానించారు. తన నియమకం కోసం పాటుబడిన వారికి ఈ సందర్భంగా కొండల్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, భిక్షపతి, శ్రీధర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

◆ నులిపురుగు నివారణపై అవగాహన

చేగుంట(తూప్రాన్): జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ చిన్నారెడ్డి అన్నారు. చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నులిపురుగు నివారణ కార్యక్రమంపై ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ వర్కర్లకు అవగాహన నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో నులిపురుగు నివారణ కార్యక్రమం కోసం సిబ్బంది బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ అనీల్‌రెడ్డి, ఎంఈఓ నీరజతో పాటు పలు గ్రామాల ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ పాఠశాలలో క్రీడల దినోత్సవం



నర్సాపూర్‌రూరల్: పట్టణంలోని బీవీఆర్‌ఐటీ క్యాంపస్ ఆవరణలో ఉన్న విష్ణు హైస్కూల్‌లో బుధవారం క్రీడల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, పరుగుపందాలు, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఆయా క్రీడలను ఆడించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, హెచ్‌డీఓలు జగన్, కృష్ణారావు, పాఠశాల ప్రిన్సిపాల్ జామి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులున్నారు.

◆ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బాబు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బాబు, ఉపాధ్యక్షుడిగా స్వామి, ప్రధాన కార్యదర్శిగా శ్రీమాన్, కార్యదర్శులుగా నవీన్, సురేశ్, కోశాధికారిగా యాదగిరి, వెంకటేశంలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు జల శ్యామ్, మాజీ అధ్యక్షుడు పెంటయ్య, రాధాకిషన్ ఉన్నారు.

◆ జీవన నైపుణ్యాలపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై లైఫ్ స్కిల్ ట్రైనర్ సునీత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఒత్తిడికి గురికాకుండా పరీక్షలో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని, ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మానెపల్లి, మంగళపర్తి, వెల్దుర్తి, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఇంటి నిర్మాణానికి స్థల పరిశీలన



పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఎలా నిర్మించాలో అవగాహన కల్పించేందుకు ప్రతీ మండల కేంద్రంలో నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గృహ నిర్మాణశాఖ ఏఈ విద్యాసాగర్‌రావు, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, నాయకులు నారాగౌడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘుపతిరెడ్డి తదితరులున్నారు.

◆ చెక్కులు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంతరావు, నవీన్‌గుప్తా శివ్వంపేటలో అందజేశారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన పలువురికి బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.